## మినీకథ

# జీతాలొచ్చాయి

ఆదూరి సావిత్రి

"ఈ రోజు జీతా లొస్తాయి గదండీ?" భర్తకు షర్టు అందిస్తూ అడిగింది జయ.

"ఔను. నే నొచ్చేలోగా నువ్వు పాలు లెక్క చూడు." అంటూ వెళ్ళిపోయాడు మాధవ్.

* * *

"కిరాణాకొట్లో ఈనెల యాభై రూపాయ లెక్కువయింది. మరి.... ఖర్చు తగ్గిస్తున్నా నన్నావ్ ?" అన్నాడు మాధవ్.

"ఈ నెల సరుకులన్నీ తగ్గించే తెప్పించా నండీ ! కానీ.... నేను పాతిక పర్సెంట్ పొదుపుచేస్తే.... ధరలు యాభై పర్సెంట్ పెరిగాయి. లాభంలేదు.... ఏ భాగ్యలక్ష్మి లాటరీఅన్నా తగిలితే తప్ప.... ఈ తరుము కొస్తున్న ధరల బారినుంచి తప్పించుకోలేం. ఇదిగో పాల బిల్లు." నవ్వుతూ అందించింది జయ.

"మై గాష్ ! ఈ నెలలో పాలు చాలా ఎక్కువ తీసుకున్నట్లున్నావే!" ఆమె అందించిన పాలబిల్లు చూస్తూ అన్నాడు మాధవ్.

"పాలవాడు పాల రేటు పెంచాడు. నేను ఎక్కువ తీసుకోటంలేదు."

"దేనికి ?"

"మున్సిపాలిటీ వాళ్ళ నిర్వాకంవల్ల." కసిగా అన్నది జయ. అప్పుడు గుర్తొచ్చింది మాధవ్‌కి.

'కమీషనర్ పాలస్టోర్ వాళ్ళని సామాన్య ప్రజలకు అందుబాటులో వుండేలా పాల రేటుతగ్గించమన్నాడు. వాళ్లు 'మాకుగిట్టుబాటు కాదు' అంటూ నిరసనగా స్టోర్లు మూసేశారు. కాఫీ లేక, మజ్జిగ లేక, పిల్లలకు పాలు లేక జనం అగ్గగ్గలాడసాగారు. అప్పుడు మున్సిపాలిటీవాళ్ళు పెద్ద గొప్పగా "మేమే పోస్తాం" అంటూ పాలకేంద్రం పెట్టారు. "మావి చిక్కని పాలు" అంటూ లీటరు మూడున్నరకు అమ్మారు. ఇది చూసి పాల స్టోరువాళ్ళు "లీటరుకు మూడు రూపాయి లిస్తే కేంద్రం పాలలాంటి చిక్కనివి పోస్తాం.... లేకుంటే నీళ్ళపాలు పోస్తాం" అన్నారు. చూస్తూ చూస్తూ నీళ్ళ పాలు కొనలేక, కేంద్రం పాలకన్నా ఓ అర్ధరూపాయి తక్కువేగదా అని సరిపెట్టుకుని అందరూ లీటరు మూడు రూపాయల రకం పాలే కొనడానికి సిద్ధపడ్డారు. తత్ఫలితంగా అంతక్రితం లీటరు రెండు రూపాయలమ్మే'పాలు హఠాత్తుగా మూడు రూపాయలయ్యాయి. పాలరేటు తగ్గిస్తామంటూ వాళ్ళు చేసిన నిర్వాకమిది! దేశంలో అప్పుడు ఒక్కడే "తుగ్లక్" వుండటంవల్ల చరిత్రకెక్కాడు. కానీ ఈనాడు దేశస్థాయిలో, రాష్ట్రస్థాయిలో స్థానిక-స్థాయిలో చరిత్ర కందని తుగ్లక్ లెందరో' అనిపించింది మాధవ్‌కి.

"నాన్నా, నాకు .... జీతాలొచ్చాక స్కూల్ డ్రెస్ కుట్టిస్తానన్నారుగా." అంటూ వచ్చిన బేబీకి డబ్బు తీసిస్తూ "కుట్టించుకోమ్మా" అన్నాడు మాధవ్.

"అయ్యా!" అంటూ బయట నుంచి పిలుపు.

"ఎవరూ ?" అన్నాడు మాధవ్.

"పండగ మామూల్టండీ.. జీతాలొచ్చాక ఇస్తానన్నార్టగదా. కాలవ లూడ్చేవాళ్ళొచ్చారు." అంది జయ.

వాళ్ళను పంపి లోపలికొస్తున్న మాధవ్‌తో "సినిమా కెడదామా" అన్నది జయ.

జీతాల రోజు తప్ప విడిరోజుల్లో సినిమా మాటెత్తని-జయ కోరిక కాదనలేక పోయాడు మాధవ్.



ఆఖరుగా మిగిలిన రెండు రూపాయల నోటును చూసుకుంటూ, 'రేపట్నుంచీ మళ్ళీ మొదలు "జీతాలొచ్చాక ఇస్తాను....జీతాలొచ్చాక కొంటాను...." నెలజీతగాళ్ళ మాప్పలేని స్లోగన్లు' అనుకుంటూ ఆనోటును పెట్టెలో పెడదామని పెట్టె తీసేసరికి ఎదురుగా సొరుగులోఉన్న వెంకటేశ్వరస్వామి ఫొటో 'నా మామూలేది ? జీతాలొచ్చాయిగా.' అని ప్రశ్నిస్తున్నట్లనిపించి గబుక్కున ఆ నోటు ఆ సొరుగులో ఉంచి దణ్ణంపెట్టాడు మాధవ్.

ప్రతి నెలా జీతాలొచ్చాక రెండు రూపాయలు ఆ సొరుగులో పెట్టడం అలవాటతనికి.

"ఇంక ఈ నెలంతా గడవాలంటే నువ్వే అప్పివ్వాలి స్వామీ .... జీతలొచ్చాక వడ్డీతోసహా ఇచ్చేస్తాలే...." అంటున్నాడు మాధవ్.